సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్

సంక్షేమం అంటే కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అనే నమ్మకం ప్రజల్లో ఉందని రాజేంద్రనగర్ అభ్యర్థి కస్తూరి నరేందర్ అన్నారు. 10లో▸

బీజేపీ కేడర్‌లో అయోమయం!

కాంగ్రెస్ శుక్రవారం విడుదల చేసిన రెండో జాబితాలో ఎల్‌బీనగర్ నుంచి మధుయాష్కీ గౌడ్‌ను ప్రకటించగా, నెల రోజుల క్రితమే బీఆర్‌ఎస్ అభ్యర్థిని ప్రకటించింది. బీజేపీ ఇంకా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. 10లో▸

ప్రింటింగ్‌ప్రెస్‌ల నిర్వాహకులకు అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సందర్భంగా కరపత్రాలు, పోస్టర్లు తదితరాలు ముద్రించే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనల గురించి ప్రింటింగ్‌ప్రెస్‌ల నిర్వాహకులకు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి శనివారం అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్

108లో ఉద్యోగావకాశాలు

కందుకూరు: 108లో పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్, కోఆర్డినేటర్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంఆర్‌ఐలో పైలెట్స్, ఈఎంటీలుగా పని చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీఎస్సీ, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పైలెట్ కోసం ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు బ్యాడ్జీ లైసెన్సు పొంది ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30, 31 తేదీల్లో హయత్‌నగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం 91542 48992, 83099 24615 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత



చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని మూసివేసిన అర్చకులు

మొయినాబాద్: చంద్రగ్రహణం సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని శనివారం సాయంత్రం మూసివేశారు. అర్ధరాత్రి 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్ర గ్రహం ఉండడంతో శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఆలయ అర్చకులు గర్భగుడి తలుపులు మూసివేశారు. గ్రహణం తరువాత ఆదివారం తెల్లవారు జామున ఆలయ సంప్రోక్షణ(శుద్ధి) చేసి స్వామివారికి ఏకాంత అభిషేకం, అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు అవకాశం కల్పిస్తామని ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు.

మైసిగండిలో..

కడ్తాల్: చంద్రగ్రహణం కారణంగా మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత ఆలయాన్ని శనివారం ఉదయం 11 గంటలకు ఆలయ అధికారులు మూసివేశారు. గ్రహణం పూర్తయిన అనంతరం ఆదివారం ఉదయం 8 గంటలకు ఆలయ సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం తిరిగి తెరవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని..



సైకిల్ యాత్ర చేస్తున్న ఆనంద్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని హైదరాబాద్ నుంచి తిరుపతికి సైకిల్‌యాత్ర చేపట్టిన రామంతాపూర్ వాసి ఆనంద్‌గౌడ్‌కు ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ నేతలు శనివారం స్వాగతం పలికారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి సైకిల్ యాత్రకు కొబ్బరికాయ కొట్టి స్వాగతం చెప్పారు. పేదల గుండెల్లో సీఎం కేసీఆర్ నిలిచి పోయారని తిరిగి ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు సత్తు ఈ సందర్భంగా అన్నారు. రెండు రోజుల క్రితం ఈ యాత్రకు ఆనంద్‌గౌడ్ శ్రీకారం చుట్టారు.

వాహన తనిఖీల్లో నగదు పట్టివేత



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల వేళ వాహనాల్లో తరలిస్తున్న నగదును ఆదిబట్ల పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం టాటా ఏరోస్పేస్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మూడు వాహనాల్లో తరలిస్తున్న రూ.4,97,080 నగదును పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డికి అందజేసినట్లు తెలిపారు.

అలకలు.. బుజ్జగింపులు!

కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు

- రెండో జాబితా ప్రకటనతో మంటలు
- నిరుత్సాహంలో ఆశావహులు
- భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో మంతనాలు
- రంగంలోకి అధిష్టానం పెద్దలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ రెండో జాబితా పలువురు ఆశావహులను నిరుత్సాహానికి గురిచేసింది. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడ్డ స్థానిక కార్యకర్తలను కాదని.. ప్యారచూట్ అభ్యర్థులకు టికెట్లు కేటాయించడంపై భగ్గుమంటున్నారు. ఎల్బీనగర్‌లో మధుయాష్కీగౌడ్, మహేశ్వరంలో కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేరును ప్రకటించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం టికెట్ విషయంలో స్థానిక నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడి నుంచి ముగ్గురు పోటీ పడగా టికెట్ దక్కని వారు కినుకవహించారు. టికెట్ దక్కించుకున్న అభ్యర్థికి ఎట్టి పరిస్థితుల్లో సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్నట్లు ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం పెద్దలు రంగంలోకి దిగి బుజ్జగిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో పోటీ నుంచి వెనక్కి తగ్గుతారా.. అభ్యర్థి గెలుపునకు సహకరిస్తారా.. మరో పార్టీ గూటికి చేరుకుంటారా అనేది వేచి చూడాలి.

కేడర్‌తో ఆశావహుల సమాలోచనలు

మహేశ్వరం నియోజకవర్గంలో మొదటి నుంచి తీవ్రమైన పోటీ నెలకొంది. ఇక్కడి నుంచి బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతతో పాటు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి మొదటి నుంచి టికెట్ ఆశించారు. పారిజాతకు దాదాపు ఖరారైందని భావించిన నేపథ్యంలో అనూహ్యంగా మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేరును ప్రకటించారు. అధిష్టానం నిర్ణయంపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆదివారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమై తమ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి భంగపడిన మరోనేత దేప భాస్కర్ రెడ్డి సైతం ఆర్కేపురం డీవీజన్ స్వాగత్ గ్రాండ్‌లో ఆదివారం కార్యకర్తలు, అభిమానులతో సమావేశం కానున్నారు. ఈ భేటీ తర్వాతే ఆయన తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే ఇక్కడి నుంచి టికెట్ దక్కించుకున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ కార్యకర్తల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం ఉదయం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నివాసానికి చేరుకుని ఆయన్ను బుజ్జగించారు. ఒకవైపు అసంతృప్తులను బుజ్జగిస్తూనే.. మరోవైపు ఇతర పార్టీల నేతలపై దృష్టి సారించారు. ఈ మేరకు తుక్కుగూడలోని మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్ నివాసానికి చేరుకుని మద్దతివ్వాలని కోరినట్లు తెలిసింది.

ఎల్బీనగర్‌లో నేతల అంతర్మథనం

గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆ తర్వాత ఆ పార్టీని వీడి.. అధికార పార్టీలో చేరిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నియోజకవర్గంలో మల్‌రెడ్డి రామిరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి కేడర్‌కు పెద్ద దిక్కుగా నిలిచారు. తమకే టికెట్ వస్తుందని చివరి వరకు వారంతా భావించారు. వీరితో పాటు ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ దంపతులు సైతం టికెట్ ఆశించారు. తీరా జాబితాలో పేరు లేకపోవడంపై వారంతా మండిపడుతున్నారు. బహిరంగ వేదికలపై విమర్శలు చేయకపోయినా అంతర్గతంగా ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. మరోవైపు రెండో జాబితాలో చోటు దక్కించుకున్న మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ తన ప్రచారాన్ని ముమ్మరం చేయడం గమనార్హం.

స్వతంత్రంగా పోటీకి సై అంటున్న దండెం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు సీనియర్ నేతలు దండెం రామిరెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి టికెట్ ఆశించారు. మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డికే టికెట్ కేటాయించడంతో వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ మేరకు నిరంజన్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లగా.. దండెం రామిరెడ్డి పెద్ద అంబర్‌పేట కేంద్రంగా తన అనుచరులతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. నిత్య నిరంజన్‌రెడ్డి దంపతులను అధిష్టానం బుజ్జగించే పనిలో పడింది. వారు శాంతిస్తారా? తిరుగుబావుటా ఎగరేస్తారా వేచి చూడాల్సిందే.

టికెట్ ఆశించి భంగపడి

చేవెళ్ల నుంచి టికెట్ ఆశించి భంగపడిన సున్నపు వసంతం అలక పాన్పు ఎక్కారు. పది రోజులుగా పార్టీకి, ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో శనివారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీం భరత్, ఇతర ముఖ్య నేతలు ఆయన నివాసానికి చేరుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కలిసి పనిచేయాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత సముచిత స్థానం లభిస్తుందని బుజ్జగించారు. తనకు పార్టీ మారే ఆలోచన లేదని, అధిష్టానం స్పష్టమైన హామీ ఇస్తే ప్రచారంలో పాల్గొంటానని తెలిపారు. అధిష్టానం హామీకోసం నవంబర్ 3వ తేదీ వరకు వేచి చూస్తానని.. తరువాత తన అభిమానులు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

సిద్ధంగా ఉండండి

- నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియను సీసీ కెమెరాల సమక్షంలో నిర్వహించాలని, అభ్యర్థుల వ్యయ వివరాలను పక్కాగా సేకరించాలని సూచించారు. నామినేషన్ స్వీకరించే రోజు నుంచి ప్రక్రియ ముగిసేవరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు సూచికను ఏర్పాటు చేయాలని.. ఇతరులు ప్రవేశించకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నామినేషన్ వేసే వారితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించాలన్నారు. నిర్దేశిత సమయానికి ముందు కానీ, తర్వాత కానీ నామినేషన్లు స్వీకరించొద్దని, నామినేషన్ల స్క్రూటినీ ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారనే సమాచారం అభ్యర్థులకు తెలియజేయాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. నామినేషన్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫింగ్ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. ఎంకోర్ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల పూర్తి సమాచారాలతో నామినేషన్లను పొందుపరచాల చెప్పారు. నామినేషన్ల ప్రక్రియ దాఖలైనప్పటి నుంచి అభ్యర్థుల వ్యయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. దీనిపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ భారతి హోళికేరి ఆయా రాజకీయ పార్టీలను కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లొకేషన్ల మార్పు, సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో 1,500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాటికి సంబంధించి సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రతిపాదించిన సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లొకేషన్ల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఈ పోలింగ్ కేంద్రాలపై ఏమైనా సందేహాలుంటే తెలియజేయాల్సిందిగా సూచించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీఎస్పీ, ఎంఐఎం, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆ పార్టీలకు ఓటు వేస్తే అంతే



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కాంగ్రెస్, బీజేపీతో వెనుకబాటు: మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: కందుకూరు వరకు మెట్రో రైలు రావాలంటే, మెడికల్ కాలేజీ నిర్మాణం జరగాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే వంట గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇవ్వడంతో పాటు వృద్ధులకు ఆసరా పింఛన్లు నెలకు రూ.5,016 ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రైతుబంధు కింద ఎకరానికి రూ.16 వేల పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే అభివృద్ధిలో వెనక్కి వెళ్తామని అన్నారు. తన కోసం నెల రోజుల పాటు నాయకులు, కార్యకర్తలు పని చేసి గెలిపిస్తే ఐదేళ్ల పాటు అండగా ఉంటామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి కారు గుర్తుకు ఓటు వేసేలా చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. పలు గ్రామాలు, తండాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునితా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వి.మల్లేష్ యాదవ్, నియోజకవర్గ కార్యదర్శి అంజయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా లబ్ధి

మీర్‌పేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ద్వారా పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, రానున్న ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుకు ఓటువేసి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, కార్యదర్శి జెటావత్ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- 'గ్యారంటీ'గా అమలవుతాయి
- ప్రజలే మా పార్టీ బలం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



సభకు హాజరైన నియోజకవర్గ ప్రజలు

చేవెళ్ల: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయంగా కనిస్తోందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. మండలకేంద్రంలోని శంకర్‌పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ రెండో విడత బస్సు యాత్రలో భాగంగా శనివారం రాత్రి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీకే శివకుమార్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్‌కుమార్, పుష్పలీల, టీపీసీసీ నాయకులు మన్సూర్‌అలీ, రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీకే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఐదు హామీలను కర్ణాటకలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలోనూ ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ బలం ప్రజలేనని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అందించిన సోనియా గాంధీ రుణం తీర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి అధికారం అందించాలని కోరారు. చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం కావటం.. అదేరోజు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు.

పార్టీలు మారిన నాయకులను అసెంబ్లీ గేట్ కూడా తాకనివ్వం

కాంగ్రెస్ పార్టీలో గెలిచి మోసం చేసి పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేల్లో ఏ ఒక్కరినీ ఈసారి అసెంబ్లీ గేట్ కూడా తాకకుండా చూసే బాధ్యత తీసుకుంటానని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల గడ్డ నుంచి స్వర్గీయ వైఎస్‌ఆర్ పాదయాత్ర ప్రారంభించి కాంగ్రెస్‌పార్టీని ఎలా అయితే అధికారంలోకి తీసుకు వచ్చారో అదే సెంటిమెంట్‌గా ఈసారి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నామని.. మళ్లీ కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకు రావాలన్నారు. ఈ ప్రాంత నాయకుల కోరిక మేరకు స్థానిక అభ్యర్థి పామెన భీంభరత్‌కే అవకాశం కల్పించినట్లు స్పష్టం చేశారు. ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఇక్కడ అవకాశం రాని వసంతం, దర్శన్‌కు అధికారంలోకి వచ్చిన తరువాత మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు జనార్దన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, డీసీసీ నాయకులు వెంకటస్వామి, ఆగిరెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, మధుసూదన్‌గుప్తా, టేకుపల్లి శ్రీనివాస్, వాజిద్, రాములు తదితరులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న డీకే శివకుమార్, పక్కన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు

15నిమిషాల్లో ముగిసిన సభ

చేవెళ్లలో సాయంత్రం 6 గంటలకు సభ ఉంటుందని వేచి చూశారు. తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోనే ఆలస్యం కావడంతో చేవెళ్లకు చేరే సరికి రాత్రి 9.40 గంటలు అయింది. ఎన్నికల నిబంధనల ప్రకారం 10 గంటలకే ప్రచారం ముగించాల్సి రావడంతో సభలో అభ్యర్థి పామెన భీంభరత్, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ ముగ్గురే మాట్లాడి 15 నిమిషాల్లో ముగించారు.

ఓటర్ కార్డు.. నాడు.. నేడు..





నాడు

ప్రస్తుతం డిజిటల్ ఓటర్ కార్డులను భారత ఎన్నికల కమిషన్ అందజేస్తోంది. గతంలో ఈ కార్డులను చేతి రాతతో అందించేవారు. ప్రింట్ చేసిన కాగితంపై ఫొటోను అతికించి వాటిపైనే భర్త పేరు, వయసు, చిరునామా, పోలింగ్ స్టేషన్, క్రమ సంఖ్య తదితరాలను పొందుపరిచేవారు. ఫొటోపై ఎన్నికల అధికారి సంతకంతో పాటు స్టాంపును వేసేవారు. అదే గతంలో ఓటర్ కార్డుగా చలామణి అయ్యేది. రాను రాను మార్పుల నేపథ్యంలో డిజిటల్ కార్డు అందుబాటులోకి వచ్చింది. వీటి ద్వారా ప్రస్తుతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

– రాజేంద్రనగర్





నేడు

తండ్రి, కూతురు అదృశ్యం


కమలాకర్(ఫైల్)


నాషిత(ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి కూతురుతో కలిసి వెళ్లిపోయాడు. ఈ సంఘటన బాలాపూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్సై మహేందర్ తెలిపిన ప్రకారం.. బాలాపూర్ గ్రామానికి చెందిన జి.శ్రీదేవికి ఏడేళ్ల క్రితం కమలాకర్(29)తో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కమలాకర్ తరచూ భార్యతో గొడవ పడుతూ.. ఈ నెల 24న రాత్రి తాగిన మైకంలో భార్యపై చేయి చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం కమలాకర్ తన కుమార్తె నాషిత(2)తో కలిసి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య శ్రీదేవి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్ పీఎస్‌లో గాని 87126 62366 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

కాంగ్రెస్ గూటికి సిద్ధంకి?

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సిద్ధంకి కృష్ణారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సిద్ధంకి కృష్ణారెడ్డి కొంతకాలంగా అటు కిషన్‌రెడ్డితో.. ఇటు పార్టీతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంచిరెడ్డిని ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ సమావేశాల నిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ పెద్దఅంబర్‌పేట పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న సిద్ధంకి పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేపట్టకుండా తటస్థంగా ఉంటూ వస్తున్నారు. దీంతో మంచిరెడ్డిపై అలకబూనిన సిద్ధంకి కృష్ణారెడ్డిని ఇదే అవకాశంగా భావిస్తున్న కాంగ్రెస్‌పార్టీ కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు పావులు కదుపుతోంది. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల రెండో జాబితాలో మల్‌రెడ్డిరంగారెడ్డి పేరు ఉండడంతో రెట్టింపు ఉత్సాహంలో ఉన్న మల్‌రెడ్డి అనుచరులు శనివారం సిద్ధంకి కృష్ణారెడ్డితో సమాలోచనలు చేసినట్లు తెలుస్తోంది. ఈసారి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌కు దూరంగా ఉంటూ వస్తున్న సిద్ధంకిని కాంగ్రెస్‌కు గూటికి తీసుకుంటే తమకు కలిసివస్తుందన్న ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో తాను చేరే విషయమై రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇస్తానని సిద్ధంకి కాంగ్రెస్ నేతలకు తెలిపినట్లు సమాచారం. గతంలో ఒకే పార్టీలో ఉన్నప్పటికీ సిద్ధంకి కృష్ణారెడ్డి, మల్‌రెడ్డిరంగారెడ్డి ఉప్పు, నిప్పులా ఉన్న విషయం తెలిసిందే. అలాంటి వ్యక్తులు ఇప్పుడు కలిసి ప్రయాణం చేయనున్నారనే ప్రచారం పెద్దఅంబర్‌పేటలో జరుగుతోంది.

'సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్'

మణికొండ: పేదలకు అందాల్సిన పథకాలు సరిగ్గా అందడం లేదని, సంక్షేమం అంటే కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అనే నమ్మకం ప్రజల్లో ఉందని, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తనకు ఎమ్మెల్యే టికెట్‌ను ఖరారు చేయడంతో శనివారం ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, సానుభూతి పరులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపి, తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పెన్షన్‌లు, పరిహారాలను అందించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు వచ్చినప్పుడే వాటి గురించి మాట్లాడి తర్వాత మర్చిపోతుందని ఆరోపించారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.


కొత్వాల్‌గూడ వాసులతో ఎమ్మెల్యే అభ్యర్థి

బాలికపై లైంగిక దాడి

యువకుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: మాయమాటలు చెప్పి మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారం గ్రామానికి చెందిన బషీర్ (19) బాలిక మేనబావ స్నేహితుడు. దీంతో ఆ యువకుడు నాదర్‌గుల్ అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉండే బాలిక(16)తో పరిచయం పెంచుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యాచారం మాజీ సర్పంచ్ మృతి


యాదయ్య (ఫైల్)

యాచారం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, యాచారం మాజీ సర్పంచ్ తెరటి యాదయ్య(68) మృతిచెందారు. ఏడాదిగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన శనివారం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. యాదయ్య భార్య లక్ష్మమ్మ యాచారం ఎంపీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి ప్రకటించారు.

బీజేపీ కేడర్‌లో అయోమయం

- ఇంకా అభ్యర్థిని ప్రకటించని కమలం పార్టీ
- ఇప్పటికే ప్రకటించిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్
- ప్రచారం ప్రారంభించిన ఇరు పార్టీల అభ్యర్థులు


బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ పార్టీ శుక్రవారం రాత్రి విడుదల చేసిన రెండో జాబితాలో ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి మధుయాష్కీ గౌడ్ పేరును ప్రకటించగా, నెల రోజుల క్రితమే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. బీజేపీ ఇంకా తమ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఆ పార్టీ నాయకులు అయోమయం చెందుతున్నారు. కాంగ్రెస్‌పార్టీలో ఇప్పటి వరకు తనకే టికెట్ వస్తుందని ఆశపడి భంగపడిన వారు మధుయాష్కీకి సహకరిస్తారో లేదో అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్‌కు బలం ఉన్నప్పటికీ కార్యకర్తల్లో జోష్ నింపే నాయకులు లేకపోవడంతో కేడర్ అంతా స్తబ్దతగా ఉంది. ఇప్పటి వరకు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఆయా డివిజన్లలోని కాలనీలో సమావేశాలు, కార్యకర్తలతో బూత్ కమిటీ సభ్యులతో పలు దఫాలు కలిసి వారితో ఎన్నికల్లో తీసుకోవాల్సిన, అనుసరించాల్సిన వ్యూహాలను రచించారు. ఇక కాంగ్రెస్ నుంచి నాయకులు పాదయాత్రలు, అడపా దడపా ర్యాలీలు, రాస్తారోకోలు, పాదయాత్రలు చేసి కార్యకర్తలను పార్టీ వీడకుండా కొన్ని జాగ్రత్తలు మాత్రం తీసుకున్నారు. అంతే కానీ పార్టీని పూర్వ వైభవంలోకి తీసుకెళ్లలేకపోయారనేది సత్యం.

కాంగ్రెస్ ఆశావహుల దారెటు.?

కాంగ్రెస్ నుంచి టికెట్ల కోసం పోటీ పడ్డ నాయకులు ఇప్పుడు మధుయాష్కీ గౌడ్‌కు టికెట్ దక్కడంతో ఏం చేస్తారనే ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది. ఇప్పటి వరకు ఎల్బీనగర్ టికెట్ తమదే అన్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితోపాటు ఇటీవలే బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన ముద్దగొని రాంమోహన్‌గౌడ్ దంపతులు ఏం చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. టికెట్ కోసం మరీ పార్టీ మారిన రాంమోహన్‌గౌడ్ కాంగ్రెస్‌లో కొనసాగుతారా? లేదా? అని అందరూ చర్చించుకుంటున్నారు. ఇక మల్‌రెడ్డి రాంరెడ్డి కూడా ఇక్కడ టికెట్ దక్కకపోవడంతో ఇబ్రహీంపట్నం నుంచి టికెట్ దక్కించుకున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తరఫున ప్రచారం చేసేందుకు ఇబ్రహీంపట్నానికి వెళ్తారా అనేది కూడా చర్చనీయాంశంగానే ఉంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థికి ప్రచారం చేస్తారో లేదో అనేది కాంగ్రెస్ లో ప్రశ్నార్థంగానే మారింది.

6 ఫుల్.. 12 బీర్లు మాత్రమే !

రాజేంద్రనగర్: ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో డబ్బు రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రూ.49 వేల కంటే ఎక్కువగా ఒకరి వద్ద ఉంటే వాటిని స్వాధీనం చేసుకుని ట్రెజరీలకు జమ చేస్తున్నారు. సంబంధిత పత్రాలను అందిస్తేనే తిరిగి ఇస్తున్నారు. అదే మద్యాన్ని రవాణా, అక్రమంగా డంప్, అనుమతి లేకుండా విక్రయించినా స్వాధీనం చేసుకుంటున్నారు. ఒక వ్యక్తి 6 ఫుల్ బాటిళ్లు, 12 బీరు బాటిళ్లను మాత్రమే తీసుకెళ్లేందుకు ఎన్నికల నియమావళి ఉంది. అతిక్రమించిన వారిపై ఎక్సైజ్ శాఖ కేసు నమోదు చేస్తారు.